క్లుప్తంగా

ఘనంగా ఆర్‌వీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేసిన నాయకులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌వీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఆర్‌వీఎఫ్ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజునాయుడు మాట్లాడుతూ సీమ హక్కుల సాధనే లక్ష్యంగా 2014లో జూలై 13న ఫెడరేషన్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఐదు రోజులపాటు ఆర్‌వీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు.అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా రవీంద్రనాథ్, కార్యదర్శిగా ప్రతాప్ ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటాద్రి, బాలక్రిష్ణనాయక్, మనోహర్, పవన్, శంకర్, వెంకట్‌రాజు, శేఖర్, ఫకూర్ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీని సహించం



నాటు సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: సారా తయారీని, విక్రయాలు, అక్రమ మద్యం రవాణాను ఏ మాత్రం సహించమని కోడుమూరు సెబ్ సీఐ రామాంజినేయులు హెచ్చరించారు. శనివారం వెల్దుర్తి మండలం ఎల్.బండ తాండలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న రెండు నాటుసారా బట్టీలపై కోడుమూరు సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం రవాణా చేసినా, సారా తయారీ చేసినా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి వారి సమాచారాన్ని తమకు తెలియాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ హామీ ఇచ్చారు. దాడుల్లో కోడుమూరు సెబ్ ఎస్‌ఐ ఆలీబేగ్, సిబ్బంది హనుమంతు, అన్సర్‌బాషా, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

స్కూటీ చోరీ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని వైన్ షాప్ వద్ద పట్టపగలే స్కూటీ చోరీకి గురైనట్లు బాధితుడు సుబ్బయ్య తెలిపారు. శనివారం మధ్యాహ్నం వైన్ సాప్ వద్ద స్కూటీని పార్కింగ్ చేసి ఉంచగా కొద్దిసేపటికే కనిపించలేదని బాధితుడు వాపోయాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

రేపు వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం పేరుతో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే అర్జీతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

జీఓ 84ను రద్దు చేయాలి

కర్నూలు (టౌన్): మున్సిపల్ పాఠశాలలను విలీనం చేసే జీఓ 84ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పీడీల అసోసియేషన్ అధ్యక్షులు దాసరి సుధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పదోన్నతుల డే సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ జారీ చేయడం వల్ల మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి పదోన్నతులు, బదిలీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జీఓను కోర్టులు సైతం వ్యతిరేకించాయన్నారు. కార్య క్రమంలో మున్సిపల్ పీడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వీరప్రకాష్‌కు అరుదైన గౌరవం

కర్నూలు(అర్బన్): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వ హించి గత నెలలో పదవీ విరమణ చేసిన బి.వీరప్రకాష్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఓ వైపు ప్ర భుత్వ ఉద్యోగం చేస్తూనే, మరో వైపు సంగీతం, కళల పట్ల తనకున్న ఆసక్తితో గాయకుడిగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతూ పలువురు పేద కళాకారులకు బాసటగా నిలుస్తూ వచ్చారు. కరో నా సమయంలో కూడా పలువురికి సహాయ సహకారాలు అందించారు. అలాగే జిల్లాలో ఆర్కెస్ట్రా కళాకారుల సేవా సంక్షేమ సంఘాన్ని స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షులుగా పలు సేవా కార్యక్రమా లు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన సేవలకు గుర్తుగా తెలంగాణ రాష్ట్రం పీస్ ఆఫ్ ఇండియా ఎన్‌జీఓ అండ్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ప్రెస్టేజియస్ అవార్డ్స్ అండ్ హానరీ డాక్టరేట్ అవార్డ్ సెర్మనీ కార్యక్రమంలో వీర ప్రకాష్‌కు భారతీయ స్ఫూర్తి సేవా రత్న అవార్డుతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి ఘనంగా సన్మానించింది. ఆయన సేవలకు లభించిన అవార్డుల పట్ల సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.

పల్లెల్లో పీర్ల పండుగ సందడి



ఓర్వకల్లు: కొలువైన పీర్లస్వాములు



గుట్టపాడులో అలిఅక్బర్‌ను దర్శించుకుంటున్న భక్తులు



లొద్దిపల్లెలో కొలువుదీరిన పెద్దస్వామి



కల్లూరు: బస్తిపాడులో కొలువుదీరిన పీర్లు

ఓర్వకల్లు: పల్లెల్లో పీర్లపండుగ సందడి నెలకొంది. మండల కేంద్రం ఓర్వకల్లుతోపాటు గ్రామాల్లోనూ పీర్ల దేవుళ్ల కొలువుదీరారు. ఈ నెల 7వ తేదీన నెలవంక దర్శనమివ్వడంతో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పీర్ల చావిళ్ల ముస్తాబు చేసి పీర్ల దేవుళ్లను కొలువుంచారు. ఓర్వకల్లుతోపాటు తిప్పాయపల్లె, బైరాపురం, గుట్టపాడు, లొద్దిపల్లె, కన్నమడకల, శకునాల, హుసేనాపురం తదితర గ్రామాలలో కొలువుదీరిన అలిఅక్బర్, మౌలాలి, దస్తగిరి, చిన్న హసన్, పెద్దస్వామి తదితర పీర్లకు భక్తులు చెక్కెర సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ 17వ తేదీన పీర్లదేవుళ్ల నిమజ్జనంతో వేడుకలు ముగియనున్నాయి.

కల్లూరు: మతసామరస్యానికి ప్రతీకంగా నిర్వహించుకునే మొహర్రం సందడి గ్రామాల్లో నెలకొంది. పీర్ల చావిళ్ల భక్తులతో కళకళలాడుతున్నాయి. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. కల్లూరు మండలంలోని పుసులూరు గ్రామంలో ఆదివారం మౌలాలి స్వామి సరిగెత్తు నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి మొక్కులు చెల్లించనున్నారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో పీర్లదేవుళ్ల కొలువుదీరారు. ప్రత్యేకించి గోరుకల్లులో కొలువైన పెద్దస్వామిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. కులాలు, మతాలకు అతీతంగా భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని చెక్కరను చదివింపులుగా సమర్పిస్తున్నారు.

కోడుమూరు రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.మండలంలో కోడుమూరుతో పాటు, వర్కూరు, పులకుర్తి, కల్లపరి, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, అనుగొండ గ్రామాల్లోని చావిళ్లల్లో పీర్లదేవుళ్ల కొలువుదీరారు. భక్తులు ఆయా పీర్లచావిళ్లకు వెళ్లి పీర్లదేవుళ్లను దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. ఆదివారం చిన్న సరిగెత్తు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

కొండలయ్య సరిగెత్తుకు సర్వం సిద్ధం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో పీర్ల దేవుళ్ల కొలువుదీరారు. ప్రత్యేకించి సి.బెళగల్‌లో కొలువుదీరిన కొండలయ్య పీరును దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు కొండలయ్య సరిగెత్తు సాగుతుందని పాత కొండలయ్య మసీద్ వస్తాద్ పోలకల్ మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం వేకువజామున కొత్తకొండలయ్య, జూములయ్యలతో కలిసి పాతకొండలయ్య సరిగెత్తు నిర్వహిస్తామని ముజావర్లు, గ్రామ పెద్దలు తెలియజేశారు.



సి.బెళగల్ : కొలువుదీరిన పాతకొండలయ్య పీరు



కల్లూరు: తడకనపల్లెలో కొలువుదిరిన పీర్లు



కోడుమూరు: కోటవీధిలో కొలువుదీరిన పీర్లస్వాములు



వెంకటగిరిలో కొలువుదీరిన పీర్లస్వాములు

కొనసాగుతున్న టీడీపీ అరాచకాలు

- హుసేనాపురంలో కూల్‌డ్రింక్ బంక్ ధ్వంసం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

ఓర్వకల్లు: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామాలలో టీడీపీ కార్యకర్తల అరాచకాలు కొనసాగుతున్నాయి. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ అనుచరులు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తను భయపెట్టడమే లక్ష్యంగా విధ్వంసాలకు పాల్పడుతున్నారు టీడీపీ నాయకులు. వీరి ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోతుంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గుర్రాల చెన్నారెడ్డి వైఎస్సార్‌సీపీ హయాంలో కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా పనిచేశాడు. ఆయన కుమారుడు రాజశేఖర్ స్థానిక మద్యం షాపు సమీపంలో కూల్ డ్రింక్ బంక్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. వీరిపై కక్షపెంచుకున్న టీడీపీ నాయకులు అక్కడి నుంచి బంక్ తొలగించాలని హుకూం చేశారు. దీంతో రాజశేఖర్ సమీపంలో ఉన్న తమ బంధువుల స్థలంలో బంకును పెట్టుకున్నాడు. అయినప్పటికీ అక్కసు వెళ్లగక్కారు. శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టర్‌తో బంక్‌ను ధ్వంసం చేశారు. దాదాపు రూ.1.50 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు తెలిసింది. జరిగిన ఘటనపై బాధితుడు రాజశేఖర్ శనివారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి, నింధితులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.



టీడీపీ నాయకుల దాడిలో ధ్వంసమైన కూల్‌డ్రింక్ బంకు

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

- కూతురికి గాయాలు

కర్నూలు: స్థానిక బళ్లారి చౌరస్తా అంబికా మెటల్ స్టోర్స్ వద్ద చిరు వ్యాపారం నిర్వహించుకుంటున్న సోమేశ్వరమ్మ (52) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకుని కూతురు ప్రశాంతితో కలిసి వీకర్ సెక్షన్ కాలనీలోని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పెద్దపాడు వైపు నుంచి గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి తల్లీకూతుళ్లను ఢీకొంది. ప్రమాదంలో సోమేశ్వరమ్మ అక్కడికక్కడే మృతిచెందగా ప్రశాంతికి రక్త గాయాలయ్యాయి. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలిసినవారు కానీ, ఆ సమయంలో ఘటనా స్థలం వద్ద ఉండి ఫొటోలు కానీ, వీడియో కానీ తీసివుంటే 90003 34894/98482 20844 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ సీఐ గౌతమి విజ్ఞప్తి చేశారు.

కోనా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పల్లకీలో ఊరేగుతున్న కోనా వేంకటేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీవారు,

సి.బెళగల్: మండలం పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసిన మూడు నెలలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఉదయం భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోనా వేంకటేశ్వరస్వామివారి మూల విగ్రహాలను ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించిన అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. కిష్ణదొడ్డితోపాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, బ్యాతోలి, పోలకల్, ఇనగండ్ల తదితర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

☛ ఇక్కడ కనిపిస్తున్న పోలీస్ సబ్ కంట్రోల్ రూం దుస్థితి చూడండి.గది తలుపులకెదురుగానే కూరగాయల బండి.. చుట్టూ ఖాళీ బాక్స్‌లు.. గుమ్మంలోనే దర్జాగా సేదతీరుతున్న మహిళ. ఇక అందులోకి పోలీసు ఎలా వెళ్లేది. అయినా వెళ్లేందుకు కూడా వీలులేనంత అపరిశుభ్రత ఆ గదిలో తాండవిస్తోంది.



☛ ఇక్కడ చూడండి.. ఇది కిడ్స్ వరల్డ్ పార్క్ వద్ద ఉన్న పోలీస్ సబ్ కంట్రోల్ రూం. అందులో సామగ్రి చూసి స్టోర్ రూం అనుకునేరు. అది ట్రాఫిక్ పోలీసుల కోసం ఏర్పాటు చేసిన గది. అయితే నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారడంతో పార్క్ నిర్వాహకులు దొరికిందే సంధు అన్నట్లు తమ సామగ్రిని ఇలా నింపేసి ఎంచక్కా తలుపులేసుకున్నారు.



☛ ఈ రెండే కాదు జిల్లా కేంద్రంలో ఎనిమిది ప్రధాన కేంద్రాల్లో పోలీస్ సబ్ కంట్రోల్ రూంలను నిర్మించారు. గాలి, వాన, ఎండలు అధికంగా ఉన్నప్పుడు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఇందులో నుంచే విధులు నిర్వహించేందుకు వీలుగా నాలుగు దిక్కులా జాలీలు, అద్దాలతో వాటిని నిర్మించారు. అయితే నిర్వహణను పోలీసు శాఖ పూర్తిగా విస్మరించడంతో దుమ్ముధూళీ పేరుకుపోయి అపరిశుభ్రంగా మారాయి. కొన్ని చోట్ల స్థానిక వ్యాపారులు, కూరగాయల గోదాముల్లా వినియోగించుకుంటుండగా.. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకుని ఎలుకలు, బల్లులు, విష కీటకాలకు ఆవాసాలుగా మారాయి. దీంతో ప్రస్తుతం పోలీసులు వర్షంలోనే నిలబడి విధులు నిర్వహించాల్సి వస్తోంది.

పోలీస్ గూడు..గోడు

- సబ్ కంట్రోల్ రూమ్‌ల నిర్వహణ గాలికి..
- దుమ్ము, ధూళీతో నిండి నిరుపయోగంగా మారిన వైనం
- రోడ్డు సైడ్ వ్యాపారులకు అడ్డాలుగా సబ్ కంట్రోల్ రూంలు



నగరంలో పెరిగిన వాహనాల రద్దీ

కర్నూలు: కర్నూలు నగరంలో సుమారు 64 ట్రాఫిక్ పాయింట్లు ఉండగా ప్రస్తుతం కేవలం 13 నుంచి 15 పాయింట్లలో మాత్రమే ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, మంత్రుల పర్యటన సందర్భంగా వాహన రద్దీ ఏర్పడి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సమస్యగా మారుతోంది. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు దాదాపు 70 మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం కేవలం 46 మంది మాత్రమే ఉన్నారు. అందులో కూడా కంప్యూటర్, కోర్టు మానిటరింగ్ విధులు వంటి వాటికి సిబ్బందిని వినియోగిస్తున్నారు. దీంతో ఉన్నవారితోనే అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నిఘాను పటిష్టం చేయడం సమస్యగా మారింది. ఉన్న సిబ్బందితోనే రోడ్లపై విధులు నిర్వహించేటప్పుడు కనీసం గతంలో సబ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చొని వాహన రాకపోకలను నియంత్రించేవారు. సబ్ కంట్రోల్ రూమ్‌లు శిథిలావస్థకు చేరడంతో రోడ్లపైనే గంటల తరబడి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చుట్టూ వ్యాపారులే..

జ్యోతి మాల్ పక్కన ఉన్న పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ పూర్తిగా చెత్త, దుమ్ము, ధూళితో నిండిపోయింది. అందులో ఏర్పాటు చేసిన బల్ల సైతం పాడైంది. సమీపంలోని పండ్ల వ్యాపారుల సామగ్రితో పాటు పండ్ల ట్రేలు భద్రపరచుకోవడానికి వినియోగించుకుంటున్నారు. పోలీసుల కోసం ఏర్పాటు చేసిన ఈ గదిని సమీపంలోని వ్యాపారులు తమ దుకాణాల అవసరాల కోసం తెచ్చుకున్న సరుకులను కూడా ఇందులోనే నిల్వ చేసుకుంటున్నారు. ఇక్కడ విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపైనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం వచ్చినా, వేసవికాలంలో ఎండ ఉన్నా రోడ్డుపైనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వీటిని ఆధునీకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.

కిడ్స్ వరల్డ్ వద్ద..

నగరంలోని కిడ్స్ వరల్డ్ కూడలి అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇది ఒకటి. ఇక్కడ పోలీస్ సబ్ కంట్రోల్ గది నిర్మించారు.కానీ సిబ్బంది కొరత వల్ల అక్కడ కొన్ని నెలలుగా పోలీసులు విధులు నిర్వహించడం లేదు. దీంతో అక్కడ నిర్మించిన పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ శిథిలావస్థకు చేరింది. కిడ్స్ వరల్డ్‌లో జరుగు తున్న అభివృద్ధి పనులకు సంబంధించిన మెటీరియల్ డ్రమ్ములు, సిమెంట్ బస్తాలు, పాత ఇనుప సామాన్లన్నీ అందులో పేర్చి తలుపులు వేయడంతో పూర్తి దుర్గంధభరితంగా మారింది. పార్కుకు వచ్చే సందర్శకులతో ఈ ప్రాంతం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే దాకా రద్దీగా ఉంటోంది. రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఇక్కడ ట్రాఫిక్ విధులకు సిబ్బందిని నియమించాలని నగర ప్రజలు కోరుతున్నారు. పోలీసు సిబ్బంది కోసం నిర్మించిన సబ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న మెటీరియల్‌ను ఖాళీ చేయించి శుభ్రం చేయిస్తే ఉపయోగంలోకి వస్తుంది.

ఐదు రోడ్ల కూడలిలో..

ఐదు రోడ్ల కూడలి అత్యంత రద్దీగా ఉన్న రోడ్లలో ఇది ఒకటి. బస్టాండ్, రైల్వే స్టేషన్, మౌర్యా ఇన్ జంక్షన్, జిల్లాపరిషత్ వైపు వెళ్లే వాహనాలతో తరచూ ఇక్కడ జామ్‌లు ఏర్పడుతుంటాయి. ట్రాఫిక్ నియంత్రణ కోసం విధులు నిర్వహించే సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన పోలీసు సబ్ కంట్రోల్ రూమ్‌ను మొబైల్ క్యాంటీన్ నిర్వాహకులతో పాటు అక్కడే ఉన్న మటన్ కొట్టు నిర్వాహకులు కూడా వారివారి సామగ్రి ఇందులో ఉంచి తలుపులు బిగిస్తుండటం వల్ల సబ్ కంట్రోల్ రూమ్ శిథిలావస్థకు చేరి బూజు పట్టి పోయింది. వాటి నిర్వహణపై పోలీసు ఉన్నతాధికారులు శ్రద్ధ చూపకపోవడం వల్ల ట్రాఫిక్ సిబ్బంది రోడ్డుపైనే నిలబడి విధులు నిర్వహిస్తున్నారు.

టీకాలతో పిల్లల ప్రాణాలకు రక్ష

కర్నూలు(హస్పిటల్): క్రమం తప్పకుండా గర్భిణులకు, చిన్నారులకు టీకాలు వేయడం వల్ల వారి ప్రాణాలకు రక్ష ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని సవారితోట, ఐటీసీ కంపెనీ సచివాలయాల్లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నారులకు ఇచ్చిన టీకాల వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు జరగబోయే స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకుని డయేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆడపిల్లను రక్షిద్దాం, ఆడపిల్లను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా ఇద్దరు ఆడపిల్లలున్న తల్లిని సన్మానించారు. ఆడపిల్లలపై వివక్ష చూపకుండా పాపైనా, బాబు అయినా సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబస్సుమ్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డీపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కాలువ కాదు... రోడ్డే !



దిన్నెదేవరపాడు రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డులలో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తోంది. రోడ్లు గుంతలుగా ఉండడంతో వర్షపునీరు చేరి కాలువలను తలపిస్తున్నాయి. ఇందుకు దినెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రత్యక్ష సాక్ష్యం. వర్షపునీరు చేరినా రోడ్డు బాగుందనుకుని వెళ్లే ప్రమాదానికి గురికావాల్సిందే.